## బీవీఆర్ఐటీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సాంగ్ వోన్ యూన్

నర్సాపూర్, జనవరి 30: నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో అమెరికాలోని బింగ్ హామ్టన్ విశ్వవిద్యాలయ ఆచార్యులతో గురువారం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అంశంపై సదస్సు నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ డా.సంజయ్‌దూబే తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీటితో పాటు తయారీ పరిశ్రమలో డిజిటల్ మార్పు, మిషిన్ లెర్నింగ్ ఉపయోగం అనే అంశంపై సదస్సు నిర్వహించామన్నారు. సదస్సుకు అమెరికాలోని బింగ్‌హామ్టన్ విశ్వవిద్యాలయం స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ నుంచి ప్రొఫెసర్ సాంగ్ వోన్ యూన్ పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సాంగ్ వోన్‌యూన్ మాట్లాడుతూ మెరుగైన నాణ్యత నియంత్రణ, కంప్యూటర్ విజన్ సిస్టమ్‌లు ఉత్పత్తుల్లోని లోపాలను తొలి దశల్లో గుర్తించడం, సప్లైచైన్ ఆప్టిమైజేషన్, అనుకూలీకరణ, ఆవశ్యకత మారుతున్న మార్కెట్ డిమాండ్లు అధిక మొత్తంలో డేటాను ప్రాసెస్ చేసి, వ్యక్తిగతీరించిన ఉత్పత్తులను రూపొందించడంలో సహాయపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీఈఎస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, ఇండస్ట్రీ రిలేషన్ డైరెక్టర్ పరుచూరి సతీష్ చంద్ర, మేనేజర్ బాపిరాజు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ



శిబిరంలో దరఖాస్తులను అందజేస్తున్న దివ్యాంగులు

రామాయంపేట, జనవరి 30: దివ్యాంగులకు అలీంకో సంస్థ ద్వారా ఉచితంగా కృత్రిమ పరికరాలు అందజేయనున్నట్లు డీడబ్ల్యూవో హైమవతి, సీడీపీవో స్వరూపారాణి తెలిపా రు. పట్టణంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసి న శిబిరంలో ఏడు మండలాలకు చెందిన దివ్యాంగుల దరఖాస్తులను తీసుకున్నారు. వైద్య పరీక్షలు చేసి దివ్యాంగులుగా గుర్తించిన వారికే ఉచితంగా ట్రై సైకిళ్లు, చేతికర్ర, వీల్‌చైర్లు, కృత్రిమ అవయవాలు అందజేస్తారన్నా రు. శిబిరంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పాండు, గౌరవ అధ్యక్షులు కుమ్మరి కుమార్, సంజీవులు, మహిళా జిల్లా అధ్యక్షురాలు గంగమణి పాల్గొన్నారు.

## జాబ్ మేళాలో 30 మంది మహిళలు ఎంపిక



మెదక్ మున్సిపాలిటీ, జనవరి 30: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళలకు గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 120 మంది పాల్గొన్నారు. ఇందులో 30 మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ ప్రకటనలో తెలిపారు. ఎంపికపైన వారికి త్వరలో నియామక పత్రాలు అందజేస్తామని గ్లిట్జ్ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ ఉపా పేర్కొన్నారు.

## రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

నిజాంపేట, జనవరి 30: నిజాంపేటలో రైతుభరోసా దరఖాస్తులను డీఏవో వినయ్ కుమార్ గురువారం స్వీకరించారు. మండలంలోని 723 మంది రైతులు నూతనంగా పట్టా పాస్‌బుక్ పొందారని, అందులో 491 మంది బ్యాంకు వివరాలు ఇచ్చారని, మిగిలిన 232 మంది రైతులు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా బుక్, పట్టా పాస్ బుక్ జిరాక్స్‌లను వ్యవసాయ అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏవో సోమలింగారెడ్డి, ఏఈవోలు రమ్య, మౌనిక ఉన్నారు.

## ప్రాక్టికల్స్‌కు ప్రతిఒక్కరూ హాజరుకావాలి

రామాయంపేట, జనవరి 30: ఇంటర్ ప్రాక్టికల్స్‌కు విద్యార్థులు కచ్చితంగా హాజరు కావాలని రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి తెలిపారు. గురువారం కళాశాలలో పర్యావరణం విద్యపై జరిగిన ప్రత్యేక పరీక్షా గదులను సందర్శించారు. శుక్రవారం మొదటి సంవత్సరం, శనివారం రెండో సంవత్సరం ఇంగ్లిష్ ప్రాక్టికల్ జరుగుతాయన్నారు.

**వంద శాతం ఉత్తీర్ణతకు కృషి**

చిన్నశంకరంపేట, జనవరి 30: ప్రాక్టికల్స్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు కృషి చేయాలని చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ తెలిపారు.

## పొలంలో పడి ఊపిరాడక వ్యక్తి మృతి



గోపి తిరుపతి (ఫైల్)

చేగుట, జనవరి 30: పొలంలో పడి ఊపిరాడక వ్యక్తి మృతి చెందిన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిట్టోజిపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపి తిరుపతి(23) మద్యానికి బానిసయ్యాడు. బుధవారం నాలుగు గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదు. ఉదయం తిరుపతి కోసం వెతుకుతుండగా, వారి పొలంలో బోర్లా పడి ఉన్నాడు. పొలంగుట్టపై నుంచి వెళ్తూ అందులో పడి ఊపిరాడక మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

## మొగి సోకిన పొలాన్ని పరిశీలించిన ఏవో



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో రాజశేఖర్ గౌడ్

చిలిపిచెడ్, జనవరి 30: మండలంలోని చండూర్ గ్రామానికి చెందిన రైతు వంకం జనార్ధన్ మూడెకరాల్లో వరి వేశాడు. మొగి పురుగు సోకడంతో పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నేసిన కథనానికి ఏవో రాజశేఖర్‌గౌడ్ గురువారం స్పందించారు. పొలం దగ్గరికి వెళ్లి రైతును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలోని చండూర్, ఫైజాబాద్ గ్రామాల్లో పొలాల్లో మొగి పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. ఈ పురుగు నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 8 కిలోలు, క్లోరంట నిలిప్రోలు 0.4 శాతం, జింక్ నాలుగు కిలోల గుళికలు, క్లోరంట నిలిప్రోల్ ఎకరాకు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆయనతో ఏఈవో దివ్యశ్రీ, రైతులు నర్సింహులు, దుర్గయ్య ఉన్నారు.

## పోలీస్ క్రీడోత్సవాల్లో మెదక్ జిల్లాకు బంగారు పతకం

మెదక్ అర్బన్, జనవరి 30: తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడోత్సవాల్లో మెదక్ జిల్లాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ కరీంనగర్‌లో జరుగుతున్న రాష్ట్ర పోలీస్ మూడో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో టేబుల్ టెన్నిస్ డబుల్స్ విభాగంలో బంగారు పతకాన్ని, సింగిల్స్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. విజేతగా నిలిచిన ఏఆర్ కానిస్టేబుల్ రాజశేఖర్‌ను ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అభినందించారు.

## రోడ్డు నిబంధనలు పాటించాలి: డీటీవో

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 30: ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించాలని జిల్లా రవాణాధికారి వెంకటస్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ మోటర్ షోరూమ్‌లో ద్విచక్ర వాహనాన్ని ప్రారంభించి, ట్రాయల్ రన్ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, బీమా కలిగి ఉండాలన్నారు. షోరూమ్ యాజమాని నరేందర్ తదితరులు ఉన్నారు.



మనోహరాబాద్: రంగాయిపల్లిలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన శేఖర్‌గౌడ్, పార్టీ శ్రేణులు



చేగుంట: నార్సింగిలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నర్సాపూర్‌లో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కొల్చారం: గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# అసమర్థ కాంగ్రెస్ 420 రోజులు హామీలు

- 420 హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్
- మోసపూరిత మాటలు మాని ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలి
- రేవంత్‌రెడ్డి పాలనపై విసుగుచెందిన ప్రజలు
- జిల్లా వ్యాప్తంగా గాంధీజీ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్/ చేగుంట/ కౌడిపల్లి/ టేక్మాల్/ అల్లాదుర్గం/ పెద్దశంకరంపేట/ మనోహరాబాద్/ కొల్చారం/ నిజాంపేట/ వెల్దుర్తి/ శివ్వంపేట/చిలిపిచెడ్, జనవరి 30: మహాత్మా.. ఈ అసమర్థ కాంగ్రెస్‌కు దారి చూపు. మంచి బుద్ధిని, జ్ఞానాన్ని ప్రసాదించు. కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలు అమలుచేసేలా చూడాలంటూ బీఆర్ఎస్ నాయకులు జిల్లా వ్యాప్తంగా గాంధీ మహాత్ముడి విగ్రహాలకు గురువారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ 420 హామీలతో అధికారంలోకి వచ్చి 420 రోజులు గడిచాయన్నారు. ఇప్పటికీ ఉచిత బస్సు తప్ప ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. నాలుగు పథకాలు ఇస్తున్నామంటూ దండోరా వేసి చివరికి పైలట్ ప్రాజెక్ట్ పేరు పెట్టి మండలానికి ఒక్క గ్రామానికే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. మిగితా గ్రామాల సంగతేంటని ప్రశ్నించారు. గణతంత్ర దినోత్సవం సాక్షిగా రాత్రి పన్నెండు దాటితే మీ ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు టంగు టంగుమంటూ పడతాయని చెప్పి గంటల వ్యవధిలోనే మాటమార్చిన సీఎం రేవంత్‌రెడ్డినే చూశామన్నారు. ఇప్పటివరకూ రైతు భరోసా పడలేదన్నారు. ప్రజలను మభ్యపెట్టి సంక్షేమ పథకాలు గుర్తుకు రాకుండా చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై కేసులు పెడుతున్నారన్నారు. ప్రశ్నించే వారందరిని అరెస్టులు చేసుకుంటూ కాలయాపన చేయడం తప్పా... ప్రజలు మేలు చేసే పని ఒక్కటి కూడా చేయలేదని విమర్శించారు. ప్రజలకు మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా డబ్బులు చెల్లించలేదని, 26న డబ్బులు వేస్తామని నేటికి డబ్బులు వేయకుండ మోసం చేస్తుందన్నారు.సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు.



పెద్దశంకరంపేటలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మండల బీఆర్ఎస్ నాయకులు



టేక్మాల్: గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కౌడిపల్లి: మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న మండల బీఆర్ఎస్ నాయకులు



నిజాంపేటలోని గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ మండల నాయకులు



అల్లాదుర్గంలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



వెల్దుర్తిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



శివ్వంపేట: ఏదుల్లాపూర్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చిలిపిచెడ్: గాంధీ చిత్రపటానికి వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ మండలఅధ్యక్షుడు అశోక్‌రెడ్డి

## భూ కబ్జాలకు పాల్పడేవారే బీఆర్ఎస్‌ను వీడారు

### ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని విమర్శించే స్థాయి మీకు లేదు: బీఆర్ఎస్ నాయకులు



శివ్వంపేట: గోమారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువ నాయకులు



వెల్దుర్తిలో విలేకర్లతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

శివ్వంపేట, జనవరి 30: అక్రమ భూములను కాపాడుకునేందుకు పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, నవీన్‌గుప్తా కాంగ్రెస్‌లో చేరారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం ఎమ్మెల్యే స్వగ్రామం గోమారంలో కాంగ్రెస్ నాయకులకు కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు నవీన్‌గుప్తాకు రాజకీయ భిక్ష పెట్టింది సునీతారెడ్డి అని మర్చిపోయావా అని మండిపడ్డారు. కొంతాన్‌పల్లి గ్రామంలో దళితుల భూములు లాక్కున్నాడని, అధికార పార్టీ కొమ్ముకాస్తాడన్నారు. కొంతాన్‌పల్లికే వచ్చి నీ చరిత్ర బయటపెడతామన్నారు. ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదని, వ్యక్తిగత దూషణలు చేస్తే ఖబడ్దార్ అని మండిడ్డారు. కార్యక్రమంలో కుంట లక్ష్మణ్, గంగిరెడ్డి నర్సింహారెడ్డి, రాకేశ్‌రెడ్డి, నగేశ్, నవీన్, శ్రీశైలం, శైలేందర్ ఉన్నారు.

**వెల్దుర్తిలో..**

వెల్దుర్తి, జనవరి 30: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని విమర్శించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మోహన్ రెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తిలో నాయకులు తోటనర్సింలు, కృష్ణాగౌడ్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఎలాంటి పదవులు లేకున్నా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రోటోకాల్ పాటించని కాంగ్రెస్ నాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ మారి కాంగ్రెస్‌లో చేరారన్నారు. బీఆర్ఎస్‌లో గెలుపొందిన ఎమ్మెల్యేలను చేర్చుకున్న కాంగ్రెస్ నాయకులు పార్టీల మార్పుల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు బుద్ధిగా మాట్లాడాలన్నారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణ, శ్రావణ్, కిష్టయ్య పాల్గొన్నారు.

## మిర్జాపల్లికి రైల్వే లైన్ ఏర్పాటు చేయాలి

**- మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి**

మెదక్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): మెదక్ నుంచి మిర్జాపల్లి రైల్వే స్టేషన్ వరకు రైల్వే లైన్‌ను మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను ఒక ప్రకటనలో కోరారు. ఈ ప్రాంతం వ్యవసాయ అభివృద్ధి క్షేత్రంగా వెలుగొంది ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చర్చి కూడా ఉందని తెలిపారు. ఏడుపాయల వన దుర్గాభవాని ఆలయం, దేశంలోనే ఎనిమిదో పోర్టు పేరు మెదక్ ఖిల్లా లాంటి ప్రాంతం, పర్యాటక కేంద్రంగా పర్యాటకులకు ఆకర్షించేలా ఉంటుందన్నారు. గతంలో తాను మెదక్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి అక్కన్నపేట నుంచి మెదక్‌కు నూతన రైల్వే లైను నిర్మాణానికి అయ్యే ఖర్చులో సగం రాష్ట్రం భరిస్తుందని కేంద్రానికి హామీ ఇవ్వడంతో మెదక్ రైల్వే లైన్ సాధ్యమైందన్నారు.

## ఏకాగ్రతతో చదివితే మెరుగైన ఫలితాలు: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

అల్లాదుర్గం, జనవరి 30: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితేనే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని డీఈవో రాధాకిషన్ అన్నారు. గురువారం మండలంలోని ముస్లాపూర్‌లో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశలో పదో తరగతి టర్నింగ్ పాయింట్ అని, మంచి మార్కులతో పాసయితే జీవితంలో మంచి స్థానంలో స్థిరపడవచ్చన్నారు. ప్రతి సజెక్టుపై పట్టు సాధించాలంటే ఏ చిన్న సందేహం ఉన్నా ఉపాధ్యాయులను అడగాలన్నారు. కొన్ని రోజులు కష్టపడితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, హెచ్ఎమ్‌లు రమేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## 3న ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ

- తక్షణమే అమల్లోకి ఎంసీసీ కోడ్
- టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్



పాపన్నపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యాంశాన్ని బోధిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం శాసన మండలి ఎన్నికల తేదీని ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలు షెడ్యూల్‌కు సంబంధించి సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నోటిఫికేషన్ ఫిబ్రవరి 3న జారీ అవుతుందన్నారు. నామినేషన్లు సమర్పించడానికి చివరి తేదీ ఫిబ్రవరి 10, స్క్రుట్నీ 11, నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు చివరి తేదీ 13, పోలింగ్ 27న ఉదయం 8:00 నుంచి మధ్యాహ్నం 4:00 గంటల వరకు జరుగనున్నదన్నారు. ఓట్ల లెక్కింపు మార్చి 3న ప్రారంభమవుతుందని, ఎన్నికల ప్రక్రియను మార్చి 8లోగా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ వచ్చినందున మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (MCC) తక్షణమే అమలులోకి వస్తుందన్నారు. మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే ఎన్నికల నియమాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్, అన్ని శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ ఆదేశాలను గమనించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్డీవో శ్రీనివాస రావు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

**పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ**

పాపన్నపేట, జనవరి 30: ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థులను భౌతిక శాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలను అడిగి జవాబులను రాబట్టారు. కలెక్టర్ వెంట తహసీల్దార సతీశ్, హెచ్ఎం మహేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## బాల్య వివాహాలను నిర్మూలించాలి



డీ.ధర్మారం పీహెచ్‌సీలో ర్యాలీ తీస్తున్న ఏఎన్ఎం, ఆశ వర్కర్లు

రామాయంపేట, జనవరి 30: బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలించాలని మహిళా సాధికారత శిశు సంక్షేమ శాఖ డిస్టిక్ కోఆర్డినేటర్ సంతోషి తెలిపారు. గురువారం డీ.ధర్మారం పీహెచ్‌సీలో పీహెచ్‌సీ డాక్టర్ హరిప్రియతో కలిసి బేటీ పడావో.. బేటీ బచావో దశాబ్ది ఉత్సవాలకు హాజరయ్యారు. అనంతరం గ్రామంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ తీశారు. ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఏదైనా సహాయం కావాలంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1098కు కాల్ చేయాల ఆమె సూచించారు.

## ఆకతాయిల ఆగడాలకు షీ టీమ్స్‌తో చెక్ పెడతాం



షీ టీమ్ సభ్యులతో సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


### - ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జనవరి 30: ఆకతాయిల ఆగడాలకు షీ టీమ్స్‌తో చెక్ పెడుతామని, మహిళలు, బాలికలు, విద్యార్థినులకు భరోసా కల్పిస్తున్నామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో షీ టీమ్స్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చిన్నారులపై నేరాలు, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, మహిళా రక్షణ, షీ టీమ్స్ ఆవశ్యకతను తెలియజేసే క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఉపయోగం మొదలగు విషయాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఆకతాయిలతో ఇబ్బందులు ఎదురైతే వెంటనే 8712657963, 6303923823 నంబర్లకు ఫోన్ చేసి, వాట్సాప్ ద్వారా మెసేజ్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, షీ టీమ్స్ సభ్యులు పాల్గొన్నారు.

**ఘనంగా అమరవీరుల దినోత్సవం**

అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరులు త్యాగాలను స్మరిస్తూ, వారి ఆత్మకు శాంతి కలుగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

## జాతీయ జెండాకు అవమానం



చిన్నశంకరంపేట, జనవరి 30: గణతంత్ర దినోత్సవం సందర్భంగా చిన్నశంకరంపేటలోని అమరవీరుల స్థూపం వద్ద ఆవిష్కరించిన జాతీయ జెండాను కాంగ్రెస్ నాయకులు దించడం మరిచారు. అది కూడా తలకిందులుగా ఎగురవేశారు. గురువారం వరకు జాతీయ జెండా తలక్రిందులుగానే ఎగురుతూ ఉంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మన్నన్ జాతీయ జెండాను తొలిగించివేయించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణను ఆరా తీయగా జెండా ఎగురవేసి, మధ్యాహ్నమే తీసివేశామన్నారు. దీనికి తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, తన వద్ద ఉన్న పతాకావిష్కరణ ఫోటోను చూపించారు. ఈ విషయమై పోలీసులను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. సంబంధిత విషయంలో పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.